# నమస్తే తెలంగాణ


## ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | బుధవారం 17 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


# నయవంచకులకు బుద్ధి చెప్పాలి

**పార్లమెంట్ ఎన్నికల్లో సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి**

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి పార్టీని మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పాలన చేసిందని, కానీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పాలనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు సాగు నీరు ఇవ్వడం లేదని, మోటర్లు పెట్టుకుందామంటే కరెంటు ఉండడం లేదని, దీంతో లక్షల ఎకరాల్లో చేతికి వచ్చిన పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

# సివిల్స్‌లో మనోళ్ల హవా

## ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి మెరుగైన ర్యాంకులు

**82వ ర్యాంకుతో సత్తా చాటిన జనగామ జిల్లాకు చెందిన కౌశిక్**

**జయసింహారెడ్డికి 104, ప్రణయ్‌కుమార్‌కు 554, కిరణ్‌కు 568, అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకులు**

*హనుమకొండ/రఘునాథపల్లి/గీసుగొండ/జనగామ చౌరస్తా, ఏప్రిల్ 16: సివిల్స్ ఫలితాల్లో మనోళ్లు సత్తాచాటారు. ఉమ్మడి జిల్లా నుంచి ఐదురుగు ప్రతిభ చాటి మెరుగైన ర్యాంకులు సాధించారు. జనగామకు చెందిన కౌశిక్ మొదటి ప్రయత్నంతోనే 82వ ర్యాంకు సాధించగా, మరికొందరు మెరుగైన ర్యాంకులతో మెరిశారు. పట్టుదలతో చదవి ఎన్నో ఏళ్ల కలను నిజం చేసుకున్న వారిని అందరూ అభినందనలతో ముంచెత్తారు.*




కుటుంబసభ్యులతో మెరుగు కౌశిక్

### తొలిప్రయత్నంలోనే కౌశిక్‌కు 82వ ర్యాంకు

జనగామ పట్టణానికి చెందిన బిల్డర్ మెరుగు సుధాకర్–సుజాత దంపతుల కుమారుడు కౌశిక్ ఆల్ ఇండియాలో 82వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీలోని ఐఐఎఫ్‌టీలో ఎంబీఏ చదివాడు. అనంతరం సివిల్స్ కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే అనుకున్న ర్యాంకును పొందాడు. 15 ఏళ్ల నుంచి ఈ కుటుంబం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నివాసముంటోంది.



### గతేడాది ఐపీఎస్‌కు ఎంపికైన జయసింహారెడ్డి

హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డికి సివిల్స్‌లో 104వ ర్యాంకు వచ్చింది. ఇతడికి గతేడాది 217 ర్యాంకు రావడంతో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. జయసింహారెడ్డి తండ్రి రావుల ఉమారెడ్డి వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో సహ పరిశోధన సంచాలకుడిగా పనిచేస్తుండగా, తల్లి లక్ష్మి గృహిణి.

### ప్రభుత్వ స్టడీ సర్కిల్‌లో చదివి 554వ ర్యాంకు



జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ రెండో ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. ఇతడి తల్లిదండ్రులు కొయ్యడ ప్రభాకర్–లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. వారి మూడవ కుమారుడైన ప్రణయ్ కుమార్ గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్, కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదివాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టడీ సర్కిల్లో చేరి సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. గతేడాది 885వ ర్యాంకు సాధించాడు.

### 568వ ర్యాంకుతో లక్ష్యానికి చేరువైన కిరణ్



వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు ప్రభాకర్–జయలక్ష్మి కుమారుడు కిరణ్ గతంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేశాడు. అనంతరం ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీ(ఐఐఎస్)లో అసిస్టెంట్ డైరెక్టర్, ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిగా అవకాశం వచ్చింది. చివరి ప్రయత్నంగా 568వ ర్యాంకు సాధించి అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాడు. కాగా కిరణ్, 5వతరగతిలో జవహర్ నవోదయ ఎంట్రెన్స్ పరీక్ష రాసి వరంగల్ మమునూరులోని నవోదయ పాఠశాలలో పదోతరగతి పూర్తి చేశాడు. అక్కడి నుంచి ఇంటర్ గుంటూరు భాష్యం కళాశాలలో, 2017లో ఢిల్లీ ఐఐటీలో బీటెక్ చదివాడు. అదేవిధంగా వరంగల్ శివనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు 764 ర్యాంకు వచ్చింది. ఈ సందర్భంగా సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన వారిని పలువురిని అభినందించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే రాజయ్య, పెద్ది, బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

# కడియం.. అంటేనే మోసం

**కార్యకర్తల కష్టం వల్లే గెలిచినవ్.. దమ్ముంటే రాజీనామా చేయ్ : మాజీ మంత్రి ఎర్రబెల్లి**

***బిడ్డా ఇక కబడ్డీ కబడ్డే.. శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఫైర్***

***స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం***

***హాజరైన అభ్యర్థి సుధీర్‌కుమార్, బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా, జడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి, మాజీ ఎమ్మెల్యే పెద్ది***

*మడికొండ, ఏప్రిల్ 16 : 'నా రాజకీయ జీవితంలో కడియం శ్రీహరి వంటి పెద్ద మోసకారిని చూడలేదు, నాలుగు సార్లు ఓడిపోయిన శ్రీహరి, ఒక్కసారి ఓడిన నన్ను విమర్శించేందుకు సిగ్గుండాలి. పార్టీ పేరు మీద, కార్యకర్తల కష్టం వల్ల గెలిచిన నువ్వు దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి చూపించాలి' అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ చేశారు. 'కేసీఆర్ అన్ని రకాల పదవులిచ్చి గౌరవం ఇస్తే మోసం చేశావు. త్వరలో నీ చరిత్ర మొత్తం బయట పెడతా' అని పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా మడికొండలో మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎర్రబెల్లితో పాటు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పాల్గొని బిడ్డా ఇక కాసుకో.. ఇద్దరి మధ్య కబడ్డీ, కబడ్డే అంటూ కడియం తీరుపై నిప్పులు చెరిగారు.*



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

'కేసీఆర్ నీకు అన్ని విధాలా పదవులు ఇచ్చి గౌరవం ఇస్తే మోసం చేశావని, నీలా నేను వెన్నుపోటు పొడవలేదని గతంలో పదవి పోగానే పార్టీ మారింది నువ్వే కాదా' అని ఎర్రబెల్లి విమర్శించారు. తెలంగాణలో టీడీపీ మనుగడ కష్టమైన తర్వాత చంద్రబాబు ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత తాను పార్టీ మారానని చెప్పారు. బీజేపీ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టబోతోందని, మేం పడగొట్టాల్సిన అవసరం లేదని అన్నారు. తనను ఓడగొట్టుకున్న పాపానికి పాలకుర్తి ప్రజలు ఏడుస్తున్నారని, ఉద్యమ సమయంలో కూడా ఏడుసార్లు గెలిచిన చరిత్ర నాదని చెప్పారు. నువ్వు ఎక్కడ పుట్టినవ్.. ఎక్కడ పెరిగినవ్.. నీ కులం ఏంటి.. నీ జీవిత చరిత్ర మొత్తం త్వరలోనే బయటపెడతానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నడిపే పరిస్థితి లేదని, ఒక్క పథకం కూడా అమలు చేసే దిక్కు లేదన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను పీడించి దోచుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ మొత్తం దివాలా తీసిందని, నా అనుభవంతో చెబుతున్నా రెండేళ్లలో ఆర్టీసీ దివాలా తీయడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, ఎవ్వరికీ భయపడవద్దని, అన్నింటికీ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రులు సీతక్క, కొండా సురేఖ పదవులకు కడియం శ్రీహరితో ప్రమాదం ఉన్నదని చెప్పారు. సమావేశంలో కార్యక్రమానికి బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బిడ్డా ఇక కాస్కో..

**మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**



కడియం శ్రీహరిపై మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. 'బిడ్డా ఇక కాసుకో.. ఇద్దరి మధ్య కబడ్డీ, కబడ్డేనని, స్టేషన్ ఘన్‌పూర్‌లో నువ్వు చేసిన అభివృద్ధి, నేను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా' అంటూ తొడ కొట్టి సవాల్ విసిరారు. విదేశాల్లో కడియం శ్రీహరి అక్రమ ఆస్తులకు కావ్య, ఆమె భర్త నజీర్ బినామీలని అన్నారు. ఇక్కడ దోచుకున్న డబ్బులతో మలేషియా, సింగపూర్‌లో అక్రమ ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. లొంగని వాళ్లను ఎన్‌కౌంటర్ చేయించిన దుర్మార్గుడు కడియం అంటూ ధ్వజమెత్తారు. మంత్రిగా ఉన్నప్పుడు డీఈవో బదిలీల్లో రూ.2 కోట్లు, లింగంపల్లి ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ వద్ద రూ.6 కోట్లు లంచం తీసుకున్నారని పేర్కొన్నారు. పేకాట ఆడుతూ దొరికితే పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టలేదా అంటూ ప్రశ్నించారు. సోషల్ వెల్ఫేర్ మంత్రిగా ఉండి అమాయక పిల్లల పొట్టకొట్టి కోట్లు దోచుకున్న చరిత్ర కడియం శ్రీహరిదేనన్నారు. ఏడు పెద్ద చెరువులను నిర్మించానని, వ్యవసాయరంగానికి ఎక్కడపడితే అక్కడ నీరందించినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులను నీ పక్షాన చేరేందుకు లేనిపోని ఆశలు కల్పించావన్నారు. నేను మాదిగ బిడ్డను, కులం పేరు చెప్పుకునేందుకు సిగ్గుపడనని, నా నియోజకవర్గంలోనే ఎప్పటికీ ఉంటానన్నారు. నీలా జిత్తుల మారి నక్కలాగా పని చేయనని, ఊసరవెల్లి వేషాలు వేయనని, రానున్న ఎన్నికల్లో డప్పు కొట్టి ప్రచారం చేసి 7 నియోజకవర్గాల్లో నీ బండారం బయటపెడతామన్నారు. నిన్ను ఓడించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి మాదిగ ప్రజలతో ఉప ఎన్నికల్లో నిన్ను పాతాళానికి తొక్కేస్తామని స్పష్టంచేశారు.

### నీతి, నిజాయితీతో పనిచేస్తా..

**బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్**



వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో వచ్చాను. మీ ఆదరాభిమానాలతో నన్ను పార్లమెంటుకు పంపిస్తే నీతి, నిజాయితీ, నిబద్ధతతో ఒక కార్యకర్తలాగే పనిచేస్తా. వరంగల్ జిల్లా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వరంగల్‌ను ముందువరుసలో నిలబెట్టారు. అనేక మంది పార్టీని వదిలి వెళ్లిపోయినా పార్టీకి వెన్నుదన్నులా కార్యకర్తలు ఉన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలాంటి వారు. పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తా.

### దుర్మార్గులకు, మంచికి మధ్య పోరాటం

**- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**


పార్లమెంట్ ఎన్నికలు దుర్మార్గులకు, మంచికి మధ్య జరిగే పోరాటంలో మంచి తప్పకుండా గెలుస్తుంది. రానున్న రోజులన్నీ మనవే. కాబోయే ముఖ్యమంత్రి కేసీఆరే. రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ తప్పకుండా కూలదోస్తుంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగే అభివృద్ధిని చాలావరకు కడియం శ్రీహరి అడ్డుకున్నారు. బిల్లుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని కొంతమంది కాంట్రాక్టర్లు మాత్రమే పార్టీ మారారు. కానీ కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని చెబుతున్నారు. నేను స్టేషన్‌ఘన్‌పూర్ బిడ్డనే.. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నాకు రెండు కళ్లు వంటివి. నియోజకవర్గంలో కడియం శ్రీహరి వల్ల ఇబ్బందులు తలెత్తితే వారికి అండగా నిలబడతా. రాజయ్య, నేను కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటాం.



# 'లోక్‌సభ'కు బీఆర్ఎస్ సన్నద్ధం

**వరంగల్ సెగ్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తల నియామకం**

**ప్రకటించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




వరంగల్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికల వ్యూహాన్ని సిద్ధం చేసింది. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పట్టున్న వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్‌లో విజయం కోసం అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నది. ప్రచార ప్రక్రియ నిర్వహణకు అనుగుణంగా సంస్థాగతంగా ఏర్పాట్లు చేస్తున్నది. ఇందులో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు సమన్వయకర్తలను నియమిస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జీలు ఉన్నారు. వీరికి, బీఆర్ఎస్ క్యాడర్‌కు సమన్వయం చేసేందుకు వీలుగా ప్రతి సెగ్మెంట్‌లో సమన్వయకర్తలు పనిచేస్తారు. బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలు పలువురికి ఈ బాధ్యతలు అప్పగించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లేని వర్ధన్నపేట నియోజకవర్గంలో ఈ బాధ్యతలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిర్వహిస్తారు. ఈ సెగ్మెంట్‌లోని ఆరు మండలాల్లో మూడు మండలాల చొప్పున వీరు పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

**అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు**

*పరకాల: ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్*

*పాలకుర్తి : ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్*

*భూపాలపల్లి : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య*

*స్టేషన్ ఘన్‌పూర్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి*

*వరంగల్ తూర్పు : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి*

*పశ్చిమ : మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, ఎస్.సుందర్‌రాజ్, నాగుర్ల వెంకన్న*

*వర్ధన్నపేట : మాజీ చైర్మన్లు కె.వాసుదేవరెడ్డి, సాంబారి సమ్మారావు*

# కొనుగోళ్లు సరే.. మద్దతు ఏదీ..?

**జనగామ మార్కెట్‌లో తొలగిన ప్రతిష్టంభన**

**క్వింటాకు రూ.1,700 నుంచి 1,923**

**అన్నదాత కష్టానికి దక్కని ప్రతిఫలం**

**ఎంఎస్‌పీ కంటే రూ.500 ధర తక్కువ**

జనగామ, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభన ఎట్టకేలకు తొలగింది. ఈ–నామ్‌లో తక్కువ ధర కోట్ చేశారనే అభియోగంపై ముగ్గురు ట్రేడర్లపై చీటింగ్ కేసు నమోదైన నేపథ్యంలో ఐదురోజులుగా మార్కెట్‌లో ధాన్యం, మక్కలు, అపరాల కొనుగోళ్లను నిలిపివేశారు. అధికారులు పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం తాము తేమ, తాలు, మట్టి ఆధారంగానే ధర నిర్ణయిస్తాం తప్ప ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా మద్దతు ధర ఇవ్వలేమని తెగేసి చెప్పడం.. ఓపిక నశించిన రైతుల ఆందోళన తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో మధ్యేమార్గంగా తేమ ఆధారంగా ధరకు అంగీకారం కుదిరింది. దీంతో మంగళవారం ఈ–నామ్ ఆన్‌లైన్ విధానం ద్వారా ట్రేడర్లు ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు.

**సర్కారు వారి పాట రూ.1700**

'సర్కారు వారి పాట క్వింటాలుకు రూ.1700, రూ.1823, రూ.1900 ఏక్ బార్..దో బార్..తీన్ బార్'..ఇదీ చివరికి జనగామ మార్కెట్‌లో ఈ–నామ్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లలో అన్నదాత శ్రమకు దక్కిన ప్రతిఫలం. ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2200 చెల్లించాల్సిన ప్రభుత్వం కుంటి సాకులు చెప్పి ధర తగ్గించి రైతును దగా చేస్తున్నది. ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు దేవుడెరుగు అసలు ధరకే రూ.500 చిల్లు పడింది. ఎంఎస్‌పీ క్వింటాకు రూ.2200కు తక్కువకు ఎవరూ కొనద్దు అని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినా అమలు కావడం లేదు. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో వారం రోజులుగా ధాన్యం రాశుల వద్ద రైతులు ఇంటిల్లిపాది పడిగాపులు కాస్తూ.. రోజూ ఆందోళన చేసిన ఫలితంగా ఎట్టకేలకు ట్రేడర్లు ఆన్‌లైన్ కొనుగోళ్లు చేశారు. తేమ, తాలు, మట్టి తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో ధరలను కోట్ చేశారు. కనిష్ఠంగా క్వింటాకు రూ.1700 నుంచి గరిష్ఠంగా రూ.1923, మధ్యస్థంగా రూ.1823 ధర లభించింది. ఈ–నామ్ ట్రేడింగ్‌లోనూ వ్యాపారులు జట్టుకట్టి ధాన్యం ధరలను నిర్ణయిస్తుంటే నిలువరించాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించారు. మరోవైపు కొనుగోలు చేసిన ఉత్పత్తులను లోడ్ చేసి తరలించేందుకు వీలుగా బుధ, గురువారం మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి బి.నరేంద్ర తెలపడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



జనగామ మార్కెట్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న అధికారులు











